క్లుప్తంగా

నేడు అరుణాచలానికి లగ్జరీ బస్సు

సత్తెనపల్లి: పల్నాడు జిల్లా సత్తెనపల్లి ఆర్టీసీ డిపో నుంచి అరుణాచలానికి శుక్రవారం రాత్రి 9 గంటలకు ప్రత్యేక సూపర్ లగ్జరీ (2+2 పుష్‌బ్యాక్) బస్సు బయలుదేరుతుందని డిపో మేనేజర్ జీఎస్‌వీవీ కుమార్ తెలిపారు. ఈనెల 6న శ్రీకాళహస్తి, కాణిపాకం, గోల్డెన్ టెంపుల్ చూసుకొని.. అదే రోజు రాత్రి అరుణాచలం చేరుతోందని అన్నారు. దర్శనం అనంతరం తిరిగి 7న కంచి.. కంచి దర్శనం అనంతరం రాత్రికి బస్సు బయలుదేరి 8న ఉదయం సత్తెనపల్లికి చేరుతుందన్నారు. టిక్కెట్ ధర రానూ.. పోనూ ఒక్కొక్కరికి రూ.2,500 మాత్రమేనన్నారు. భక్తులు, యాత్రికులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన కోరారు. ఇతర వివరాలకు 99592 25429, 73828 97583, 73828 96966, 73828 97116 నంబర్లలో సంప్రదించాలన్నారు.

లింగ వివక్ష లేని సమాజం కోసం కృషి చేయాలి



పెదకూరపాడు: లింగ వివక్ష లేని సమాజం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఐసీడీసీ పెదకూరపాడు సెక్టార్ సూపర్‌వైజర్ షేక్ పెద్ద ఇమాంబీ అన్నారు. పెద్దకూరపాడులోని అంగన్‌వాడీ-4 సెంటర్ పరిధిలో లింగ వివక్షత నిర్మూలనపై గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా హిమాంబీ మాట్లాడుతూ.. సమాజంలో స్త్రీ పురుషులు ఇద్దరూ సమానమే అన్నారు. మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని, ప్రభుత్వాలు అందుకు అనుగుణంగా ప్రోత్సాహాలు అందిస్తున్నారని తెలిపారు. స్త్రీకి ప్రాధాన్యమిస్తే సమాజం, కుటుంబంలో ఆర్థిక అసమానతలు తొలగిపోతాయన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు గోగులపాటి కుమారి, విజయలక్ష్మి, కై రున్, నజీరున్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

పెదకూరపాడు: విద్యుత్ మరమ్మతుల కారణంగా శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు మండలంలోని లగడపాడు ఫీడర్ పరిధిలో గల లగడపాడు, హుస్సేన్ నగరం, రామాపురం, గారపాడు, బుచ్చయ్యపాలెం, కనుగొన్న గ్రామాలలో విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ ఏఈ దాసరి రామకృష్ణ గురువారం తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

విద్యార్థులకు ఉచితంగా వైద్య పరీక్షలు



రాజుపాలెం: సీజనల్ వ్యాధుల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వ ఆయుష వైద్యాధికారి డాక్టర్ ఆర్.శ్రీనివాస్ తెలిపారు. మండలంలోని కోటనెమలిపురి ప్రాథమిక పాఠశాలలో ఆయుష్ వైద్యాధికారి ఆధ్వర్యంలో గురువారం విద్యార్థులకు ఉచితంగా వైద్యశిబిరం నిర్వహించారు. వ్యక్తిగత శుభ్రతను పాటించాలని వారికి సూచించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు అరుణకుమారి, ఉపాధ్యాయులు బాలు, ఆయుష్ సిబ్బంది లక్ష్మీనారాయన పాల్గొన్నారు.

యువతి అదృశ్యంపై కేసు

సత్తెనపల్లి: యువతి అదృశ్యంపై సత్తెనపల్లి రూరల్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు అయ్యింది. పోలీసుల వివరాల ప్రకారం.. సత్తెనపల్లి మండలం వావిలాలనగర్ గ్రామానికి చెందిన ఓ యువతి(20) సత్తెనపల్లిలోని ఓ వస్త్ర దుకాణంలో పని చేస్తోంది. ఈ క్రమంలో ఈనెల 1న ఇంటి నుంచి తన స్నేహితురాలిని కలిసి వస్తానని చెప్పి సత్తెనపల్లి వెళ్లింది.
తిరిగి ఇంటికి రాకపోవడంతో స్నేహితులు, బంధువుల ఇళ్ల వద్ద ఆరా తీయగా ఎలాంటి సమాచారం లభించలేదు. ఫోన్ స్విచ్ ఆఫ్ వస్తుండటంతో ఆమె తల్లి సత్తెనపల్లి రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా బుధవారం రాత్రి పోలీసులు యువతి అదృశ్యంపై కేసు నమోదు చేశారు.

జీఎస్టీ రేట్లు తగ్గించడంతో ప్రజలకు ఊరట

అమరావతి: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజలకు అవసరమైన పలు వస్తువులపై జీఎస్టీ రేట్లు తగ్గించడం పేద ప్రజలపై భారం తగ్గించడమేనని రాష్ట్ర బీజేపీ కార్యదర్శి, ఎంపీపీ మేకల హనుమంతరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీ తీసుకున్న ఈ నిర్ణయం వల్ల సామాన్య ప్రజలు, వ్యాపారులు, పరిశ్రమలు లబ్ధి పొందుతాయన్నారు.

విజృంభిస్తున్న విష జ్వరాలు

- జ్వరాల బాధతో ప్రజలు
- పారిశుద్ధ్యలోపం, కలుషిత నీరు కారణం
- జాగ్రత్తలు పాటించాలంటున్న వైద్యాధికారులు



కమ్యూనిటీ హెల్త్ సెంటరులో చికిత్స పొందుతున్న జ్వరపీడితులు

అమరావతి: మండల పరిధి గ్రామాల్లో పారిశుద్ధ్యం సరిగా లేక.. తాగునీరు కలుషితమవ్వడంతో ఆ ప్రభావం ప్రజారోగ్యంపై పడుతుంది. గ్రామాల్లో ఇప్పటికే ఇంటికి ఒకరు చొప్పున జ్వరపీడితులున్న పరిస్థితి నెలకొంది. మండల కేంద్రమైన అమరావతి కమ్యూనిటీ హెల్త్ సెంటరులో గత వారం రోజులుగా నమోదైన కేసులలో అత్యధిక శాతం కేసులు విష జ్వరాల బారిన పడిన రోగులవే కావడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. వైద్య ఆరోగ్యశాఖ, పంచాయతీరాజ్, గ్రామీణ నీటి సరఫరా శాఖలు సమన్వయంతో పనిచేయకపోవడంతో గ్రామాల్లో వ్యాధుల ఉధృతి పెరగడానికి కారణమని తెలుస్తోంది. గ్రామాలలో ఇటీవల కురిసిన వర్షపు నీరు కొన్ని చోట్ల బయటకు పోయే దారిలేక పలు రోడ్లపైనే నిల్వ ఉండడంతో దోమలు వృద్ధి చెందుతున్నాయి. దీనికి తోడు గ్రామ పంచాయతీలలో నిధులు లేకపోవడంతో సర్పంచ్‌లు, కార్యదర్శులు పారిశుద్ధ్యంపై దృష్టి సారించలేకపోతున్నారు.



ఫార్మసీ వద్ద మందులు తీసుకుంటున్న రోగులు

జ్వరాలతో బాధపడుతున్న ప్రజలు..

ప్రస్తుతం మండలంలోని అన్ని గ్రామాలలో టైఫాయిడ్, చికెన్‌గునియా, మలేరియా వంటి జ్వరాలు ప్రబలుతున్నాయి. గత 15 రోజులుగా స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో మండల పరిధిలోని గ్రామాలకు చెందిన రోగులు చికెన్‌గునియా, విష జ్వరాలతో రోజుకు సుమారు 50 మందికి పైగా అవుట్ పేషెంట్ విభాగంలో చికిత్స తీసుకుంటుంటే సుమారు 50 నుంచి 60 మంది వరకు ఇన్‌పేషెంట్ విభాగంలో రోగులు చికిత్స పొందుతున్నారు. అలానే అత్తలూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రతి రోజు 15 నుంచి 20 మంది వరకు జ్వరాలతో బాధపడుతున్న రోగులు చికిత్స పొందుతున్నారు.

ప్రజారోగ్యంపై చర్యలు తీసుకోవాలి..

అవుట పేషెంట్ విభాగంలో 100 మందికి పైగా జ్వరాల రోగులు వైద్యసేవలు పొందుతున్నారు. మండలంలో పలు గ్రామాలలో తాగునీరు ఫిల్టర్ కాకపోవడం, రా వాటర్ పంపిణీ, తాగునీటి ట్యాంకులు శుభ్రం చేయకపోవడం, పారిశుద్ధ్యం సరిగా లేకపోవడంతో విష జ్వరాలు ప్రబలుతున్నాయి. సంబంధిత మండల స్థాయి అధికారులు చొరవ తీసుకుని గ్రామ స్థాయిలో సర్పంచ్‌లతో చర్చించి గ్రామాల్లో ప్రజారోగ్యం క్షీణించకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

జాగ్రత్తలు పాటించాలి..

జ్వరాల నివారణకు గ్రామాలలో వర్షపు నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. సైడ్ కాలువలు శుభ్రంగా ఉంచుకుని దోమలు వృద్ధి చెందకుండా చూసుకోవాలి. కాచి వడబోసిన నీటిని మాత్రమే తాగాలి. ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకుంటే కొంతమేర విష జ్వరాలను నివారించవచ్చు. జ్వరం ఎక్కువగా ఉన్న రోగులు వెంటనే వైద్యుల సలహా మేరకు మందులు వాడాలి.

– శివరత్నకుమార్, వైద్యాధికారి, అత్తలూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

యూరియా కృత్రిమ కొరత సృష్టిస్తే ఉపేక్షించం

- అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు
- ఎరువు తనిఖీల్లో అధికారులు



యూరియా నిల్వలను తనిఖీ చేస్తున్న తహసీల్దార్

నకరికల్లు: యూరియా కృత్రిమ కొరత సృష్టించినా.. అధిక ధరలకు విక్రయించినా కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ కె.పుల్లారావు హెచ్చరించారు. నకరికల్లులోని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘంలోని ఎరువుల నిల్వలను గురువారం వ్యవసాయశాఖ అధికారులతో కలిసి ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా తాహసీల్దార్ మాట్లాడుతూ.. యూరియా, డీఏపీ లాంటి ఎరువుల నిల్వలు, రవాణా, క్రయ విక్రయాలపై ప్రత్యేక దృష్టి పెట్టామన్నారు. మండల వ్యవసాయాధికారి కె.దేవదాసు మాట్లాడుతూ.. నకరికల్లులోని పీఏసీఎస్‌లో 43.65 మెట్రిక్ టన్నుల యూరియా వచ్చిందన్నారు. యూరియా బస్తా ఒక్కోటి రూ.266.50లకే పంపిణీ చేసేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. అనంతరం ఎమ్మార్పీ ధరపై యూరియాను రైతులకు అందజేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ సీఈవో శ్రీనివాసరావు, గ్రామ వ్యవసాయ సహాయకుడు వై.ప్రభాకర్, రైతులు సాగి శ్రీనివాసరావు, తిరుమలశెట్టి వెంకట్రావు, డీకొండ రామదాసు తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల నిల్వలు తనిఖీలు..

నకరికల్లు: ఎరువుల విక్రయాల్లో నిబంధనలు పాటించకుంటే లైసెన్సులు రద్దు చేస్తామని మండల వ్యవసాయాధికారి కె.దేవదాసు హెచ్చరించారు. నకరికల్లులోని పలు ఎరువుల దుకాణాల్లో గురువారం ఆయన ఆకస్మిక తనిఖీలు చేశారు. రికార్డులు తనిఖీ చేసి నాణ్యతా ప్రమాణాల పరీక్షల కోసం 4 రకాల ఎరువుల నమూనాలు సేకరించారు. రేషన్ డీలర్‌లు దుకాణాల్లో అమ్మిన ఎరువుల వివరాలను ఐఎఫ్ఎంఎస్ మెషీన్‌లో రైతుల వేలి ముద్రలతో నమోదు చేయాలన్నారు. రసీదు పుస్తకాలు, నిల్వలు ఎప్పటికప్పుడు రికార్డులలో పొందుపరచాలని సూచించారు. నిల్వల వివరాలు, ధరలను బోర్డుపై ప్రదర్శించాలని ఆదేశించారు. సేకరించిన ఎరువుల నమూనాలను నాణ్యతా పరీక్షల నిమిత్తం ల్యాబ్‌కు పంపనున్నట్లు తెలిపారు. తనిఖీల్లో గ్రామ వ్యవసాయ సహాయకుడు వై.ప్రభాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

సెపక్ తక్రా సబ్ జూనియర్ జిల్లా జట్ల ఎంపిక



ఎంపికైన బాల, బాలికల జిల్లా జట్లతో పీడీలు

సత్తెనపల్లి: పల్నాడు జిల్లా సెపక్ తక్రా అసోసియేషన్ ఆధ్వర్యంలో సబ్ జూనియర్ బాల, బాలికల జిల్లా జట్ల ఎంపికలు సత్తెనపల్లి మండలం నందిగామ జిల్లా పరిషత్ పాఠశాలలో గురువారం నిర్వహించారు. ఎంపికలకు పల్నాడు జిల్లా నుంచి బాలుర విభాగంలో 35 మంది, బాలికల విభాగంలో 20 మంది హాజరయ్యారు. వీరిలో బాలుర జట్టుకు కె.చిరంజీవి, ఎం.మనోహర్, డి.జాన్సన్, కె.శ్రీనాథ్, టి.ప్రవీణ్ కుమార్, స్టాండ్ బైలుగా ఆర్.సంతోష్, కె.శామ్యూల్ రాజు, కె.సాత్విక్ ఎంపికయ్యారు. బాలికల జట్టుకు ఒ.దీవెన, పి.గాయత్రి, కె.గీతిక, బి.కెజియా, బి.అహల్య, స్టాండ్ బైలుగా డి.స్వరూప, కె.థెరిస్సారాణి, కె.సంగీతలు ఎంపికయ్యారు. ఎంపికైన క్రీడాకారులు ఈనెల 12, 13 తేదీల్లో అనంతపురం జిల్లా ఉరవకొండలో జరిగే రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ ఛాంపియన్‌షిప్‌లో పాల్గొంటారని పల్నాడు జిల్లా సెపక్ తక్రా అసోసియేషన్ కార్యదర్శి పి.శివరామకృష్ణ తెలిపారు. సెలక్షన్ కమిటీ సభ్యులుగా లాకు పిచ్చయ్య, బి.అనిల్ దత్త నాయక్, వై.చిరంజీవి వ్యవహరించారు. కార్యక్రమంలో ఉమ్మడి గుంటూరు జిల్లా స్కూల్ గేమ్స్ అండర్-19 కార్యదర్శి జి.నరసింహారావు, ఆదిత్య ఫిజికల్ ఎడ్యుకేషన్ స్టడీ సర్కిల్ డైరెక్టర్ దాసరి కోటేశ్వరరావు, విద్యా కేంద్రం జూనియర్, డిగ్రీ కళాశాలల డైరెక్టర్ దగ్గుబాటి వెంకటేశ్వరరావు, ప్రధానోపాధ్యాయులు కాకరపర్తి శ్రీనివాసరావు, తోక సోమనాథ్, వ్యాయామ ఉపాధ్యాయులు గండు సాంబశివరావు, కోణంకి కిరణ్ కుమార్, ప్రసన్న, మెహబూబి తదితరులు పాల్గొన్నారు.

18.35 మెట్రిక్ టన్నుల ఎరువుల అమ్మకాలు నిలుపుదల



స్టాక్ రిజిస్టర్ పరిశీలిస్తున్న ఏడీఏ రవిబాబు

సత్తెనపల్లి: ఫారం ఓ పత్రాలు లేనటువంటి రూ.5,35,050 విలువ కలిగిన 18.35 మెట్రిక్ టన్నుల ఎరువుల అమ్మకాలు నిలుపుదల చేస్తూ సత్తెనపల్లి సబ్ డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు బి.రవిబాబు ఆదేశాలు ఇచ్చారు. పల్నాడు జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు సత్తెనపల్లి పట్టణ పరిధిలోని ఎరువుల దుకాణాల్లో ఆయన గురువారం తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా రవిబాబు మాట్లాడుతూ.. రైతులకు కావాల్సిన ఎరువుల నిల్వలు రైతు సేవా కేంద్రాలు, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల వద్దఅందుబాటులో ఉంచుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సత్తెనపల్లి మండల వ్యవసాయ అధికారి బి.సుబ్బారెడ్డి, సిబ్బంది ఉన్నారు.

గోవులను కాపాడుకుందాం!

విశ్వ హిందూ పరిషత్ పల్నాడు జిల్లా అధ్యక్షులు రవికుమార్

అచ్చంపేట: యావత్ భారతావని ఎంతో పవిత్రంగా పూజించే గోవులను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి భారతీయునిపై ఉందని విశ్వ హిందూ పరిషత్ పల్నాడు జిల్లా అధ్యక్షులు భాగవతుల రవికుమార్, ఉత్తరాంధ్ర ప్రముఖులు సుబ్బారాయుడు, చలపతిరావు తదితరులన్నారు. పల్నాడు జిల్లా గోరక్షా ప్రముఖులు తుమ్మా మర్రెడ్డి ఆధ్వర్యంలో మండలంలోని కోనూరులో గురువారం నిర్వహించిన గోరక్ష కమిటీ సమావేశంలో వారు మాట్లాడారు. గోవులను రక్షించుకునేందుకు గ్రామ గ్రామానా కమిటీలు ఏర్పాటు చేయవలసిన అవసరం ఉందన్నారు. అనంతరం గ్రామ కమిటీని ఏర్పాటు చేశారు. కమిటీ సభ్యులుగా వాసిరెడ్డి తిరుమల, రాకొండ నిరిశింహారావు, గుంటుపల్లి కోటేశ్వరరావు, వాసిరెడ్డి సత్యనారాయణ, కుంట కృష్ణ, బొగ్గవరపు శేషగిరిరావు, జుజ్జూరి వీరాంజనేయులు, నడకుదిరి రామయ్య, మూస సాంబశివరావు, వాసిరెడ్డి శ్రీనివాసరావు, గంగశివ తదితరులను కమిటీ సభ్యులుగా నియమించారు.

భక్తిశ్రద్ధలతో గణపతి శోభాయాత్ర



ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన గణనాథుడు



శోభాయాత్రను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్



రెడ్డియూత్ ఆధ్వర్యంలో గణపతి ఊరేగింపు

పెదకూరపాడు: పెదకూరపాడు మిట్ట ప్రాంతంలో ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యంలో గణనాథుడి శోభాయాత్ర గురువారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శోభాయాత్రను పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వేలాది మంది భక్తులు యాత్రలో పాల్గొన్నారు. గ్రామోత్సవంలో కేరళ నృత్యాలు, గిరిజన నృత్యాలు ఆకట్టుకున్నాయి. మండలంలోని పలు గ్రామాలలో ఏర్పాటు చేసిన గౌరీతనయుడి విగ్రహాలు అమరావతి కృష్ణమ్మ ఒడికి చేరుకున్నాయి.

రాజుపాలెం: మండలంలోని అనుపాలెంలో రెడ్డి యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణనాథుని నిమజ్జన కార్యక్రమం గురువారం వైభవంగా నిర్వహించారు. వాహనానికి ఏర్పాటు చేసిన లైటింగ్ సెట్టింగ్ గ్రామోత్సవంలో ఆకర్షణగా నిలిచింది. అనంతరం గ్రామానికి సమీపంలోని పెద్ద కాలువలో గణపతి విగ్రహాన్ని నిమజ్జనం చేశారు.

పేపర్ పానయ్యకు సత్కారం

40 ఏళ్లుగా న్యూస్ పేపర్ వేస్తూ సేవలు



సత్కార కార్యక్రమంలో పానయ్య

పెదకూరపాడు: గత 40 ఏళ్లుగా పెదకూరపాడు మండలం 75 తాళ్లూరు, పరస, కాసిపాడు గ్రామాలకు సైకిల్‌పై వెళ్లి న్యూస్ పేపర్లను వేస్తున్న చల్లపల్లి పానయ్యను జాతీయ వార్తాపత్రికల పంపిణీ దారుల దినోత్సవం సందర్భంగా గ్రామస్తులు, ఉపాధ్యాయులు గురువారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా జిల్లా పరిషత్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు, సాహితీవేత్త, కవి డాక్టర్ అన్నపరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. 77 ఏళ్ల పానయ్య సీనియర్ పేపర్ బాయ్ అని కొనియాడారు. అనంతరం ఆయనను శాలువాతో సన్మానించారు. సీనియర్ పాత్రికేయులు, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి మునగోటి శ్రీనివాసరావు, మాజీ ఎంపీటీసీ గుత్తికొండ శ్రీనివాస రెడ్డి, గ్రామస్తులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపిక



రాయపూడి సాంబశివరావు




హిమని

పెదకూరపాడు: జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా పెదకూరపాడు మండలానికి చెందిన ఇద్దరు గురువులు ఎంపికయ్యారు. అక్షరాస్యతను పెంచి సేవలో ఆదర్శంగా నిలుస్తున్న పెదకూరపాడు మండల పరిషత్ ప్రాథమిక ఆదర్శ పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాయపూడి సాంబశివరావు, విద్యార్థులతో మమేకమై బోధన సాగిస్తూ మండలంలో 75 తాళ్లూరు జేబీ పాఠశాలను ఆదర్శంగా నిలుపుతున్న ఉపాధ్యాయుని బి.హిమనిలు జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు. ఈ సందర్భంగా వారికి మండల విద్యాశాఖ అధికారి ఏ.కులప్రసాదరావు, సత్యనారాయణ, ఉపాధ్యాయ సంఘం నాయకులు అభినందనలు తెలిపారు.

చదువు ఉన్నత స్థాయిలో నిలుపుతోంది



ప్రభుత్వ జూనియర్ కళాశాల కార్యక్రమంలో అధ్యాపకులు



గురుపూజోత్సవంలో సన్మానం అందుకున్న ఉపాధ్యాయులు

బెల్లంకొండ: చదువు వ్యక్తిని ఉన్నత స్థానంలో నిలుపుతోందని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్స్‌పాల్ కె.కవిత తెలిపారు. గురువారం స్థానిక కళాశాలలో గురుపూజోత్సవాన్ని ఘనంగా నిర్వహించి సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలతో నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులు అధ్యాపకులను సత్కరించారు. అధ్యాపకులు ఆదెయ్య, లక్ష్మీ సులోచన, వై.రమేష్‌బాబు, సాంబశివరావు, కుసుమకుమారి, రత్నకుమారి, రమేష్, సత్యప్రభ, అంకమ్మ, అరుణ తదితరులు పాల్గొన్నారు.

క్రోసూరు: క్రోసూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం గురుపూజోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమనికి ముఖ్యఅతిథులుగా తహసీల్దార్ వి.వి.నాగరాజు, ఎంపీడీవో రవికుమార్, ఎస్ఐ రవిబాబు ఎంఈవోలు, జి.కృష్ణ, గణేష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు గురుపూజోత్సవ విశిష్టతను తెలియజేశారు. అనంతరం సర్వేపల్లి రాధాకృష్ణన్ సేవలను కొనియాడి ఆయన చిత్రపటానికి నివాళులు అర్పించారు. విద్యార్థులు ఉపాధ్యాయలందరినీ ఘనంగా సత్కరించారు. కార్యక్రమానికి పాఠశాల హెచ్ఎం దుగ్గి బాబూరావు అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పాఠశాలకు బడి ఈడు పిల్లలు



బడిబయట పిల్లలతో ఎంఈవో-2 రాఘవేంద్రరావు, హెచ్ఎంలు

సత్తెనపల్లి: బడి బయట పిల్లలను నలుగురిని గుర్తించి గురువారం అధికారులు ప్రభుత్వ పాఠశాలలో చేర్పించారు. సత్తెనపల్లి మండలం ధూళిపాళ్ల స్పిన్నింగ్ మిల్ ఏరియాలోని బడి బయట పిల్లల్ని మండల విద్యాశాఖ అధికారి ఏ.రాఘవేంద్రరావు నేతృత్వంలోని బృందం బడి ఈడు పిల్లలకి చదువు విశిష్టతను వివరించారు. అనంతరం నలుగురు విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలలో చేరేందుకు ఒప్పించారు. ఐదవ తరగతి పూర్తి చేసిన పాపు నాహక్, ప్రియ నాహక్, నాయక్ ఆశ, చట్టు హరివంశీలు బడి బయట ఉండడంతో ఆరో తరగతి చదివేందుకు వెన్నాదేవి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చేర్పించారు. బృందంలో వెన్నాదేవి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరెడ్డి, వెన్నాదేవి ప్రైమరీ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రత్నరాజ్, కంకణాలపల్లి ప్రైమరీ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పద్మావతి, సీఆర్పీలు రాంప్రసాద్, నరేంద్ర ఉన్నారు.

కిశోరి బాలికలకు అవగాహన కార్యక్రమం



కార్యక్రమంలో మాట్లాడుతున్న లక్ష్మీసునీత

మాదల(ముప్పాళ్ళ): మండలంలోని మాదల గ్రామం బీసీ వెల్ఫేర్ బాలికల గురుకుల పాఠశాలలోని విద్యార్థినులకు ఐసీడీఎస్ ఇరుకుపాలెం సెక్టార్ ఆధ్వర్యంలో లింగ సమానత్వంపై కిశోర బాలికలకు గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సంకల్ప 10 డేస్ అవేర్‌నెస్ ప్రోగ్రామ్‌లో పాఠశాల ప్రిన్సిపాల్ కె.లక్ష్మీసునీత, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జి.జయలక్ష్మీ పాల్గొని పురుషులు, స్త్రీలు సమాన హక్కులు కలిగి ఉంటారని చెప్పారు. కార్యక్రమంలో సఖి వన్‌స్టాప్ సెంటర్ వర్కర్ పి.స్రవంతి, కుమారి, జి.నవీన, అంగన్‌వాడీ కార్యకర్తలు శాంతి, సుధ, వీరమ్మ, వీరకుమారి తదితరులు పాల్గొన్నారు.

పశువులకు బలవర్ధక ఆహారం అవసరం

అమరావతి: పశువులు మేత తీసుకోవడం తగ్గిస్తే క్షీణించిపోతాయని.. దీని నివారణకు పశువులకు ఖనిజ లవణాల మిశ్రమం వాడాలని, దీంతో అవి ఆరోగ్యకరంగా ఉంటాయని పశుగణాభివృద్ధిశాఖ ఏడీఏ వెంకట్రామయ్య గురువారం ఒక ప్రకటనలో రైతులకు సూచించారు. పశువులకు కాల్షియం, ఫాస్పరస్, సోడియం పొటాషియం, రాగి, మెగ్నీషియం, క్లోరిన్ వంటి ఖనిజాలను తగు మోతాదులో అందించడం వల్ల పశువులు ఆరోగ్యంగా పెరుగుతాయన్నారు. అలాగే పశువులలో రోగ నిరోధకశక్తి పెరిగి, పెయ్యలు, పడ్డలు సకాలంలో ఎదకు రావటంతో పాటు పాల దిగుబడి పెరుగుతుందని ఆయన ఆ ప్రకటనలో పేర్కొన్నారు.